క్లుప్తంగా

ఉమానీలకంఠేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.15లక్షలు



హుండీ ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో ప్రసాద్

సీతమ్మధార : స్థానిక నక్కవానిపాలెం ప్రాంతంలో గల శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ ఆదాయం సోమవారం లెక్కించారు. మొత్తం 165 రోజులకు హుండీ ఆదాయం రూ.3.15 లక్షలు వచ్చిందని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. వీరి పర్యవేక్షణలో ఆదాయం లెక్కించారు. అర్చకులు రామారావు శర్మ, మహేష్, సిబ్బంది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 వినతులు



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్

సీతమ్మధార : స్థానిక సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పది మంది వినతిపత్రాలు అందించారు. తహసీల్దార్ ఎం.రమేష్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కులం, ఆదాయం, నివాసం, ఇతర ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల వారసత్వ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు అందించిన పేదలతో మానవ సేవే మాధవ సేవ సభ్యులు

మురళీనగర్ : మురళీనగర్‌లోని మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ సభ్యులు సోమవారం పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. శ్రీదేవి పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో నిరాశ్రయులైన 12 మందికి పార్కు అధ్యక్షుడు పి.సూర్యనారాయణ చేతుల మీదుగా సరకులు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సనపల భానుప్రకాష్, అధ్యక్షుడు ఎస్.సీతారామకృష్ణ, డి.వరప్రసాద్, పి.గిరిధర్, వై.తిరుమూర్తి, కేవీ వర్మ, పి.సంతోష్ కుమార్, పి.సతీష్‌కుమార్, టి.సూరిబాబు, బి.వెంకటేశ్వరరావు, పి.వెంకటరావు, పీఎస్ఆర్ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ఆనందమయ జీవనం



వనితా వాకర్స్ క్లబ్ సమావేశంలో మాట్లాడుతున్న అపరంజి

మురళీనగర్ : ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవడం ద్వారా ఆనందమయ జీవితాన్ని పొందవచ్చని మురళీనగర్ బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (శాంతిధామం) ఇన్‌ఛార్జి అపరంజి సూచించారు. మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. వనితా వాకర్స్ క్లబ్ మహిళలు నిర్వహిస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ - 101 పూర్వ గవర్నర్ యు.శుభ, కార్యదర్శి ఎం.జయ, జాలీవాకర్ ఎం.ప్రమీలారావు, సంయుక్త కార్యదర్శి జి.శిరీషలత పాల్గొన్నారు.



నీటి నిల్వలు పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



దోమ లార్వాలు పెరుగుతున్న నీటిని తొలగిస్తున్న సిబ్బంది



దోమల నియంత్రణకు ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అవగాహనతోనే డెంగ్యూకు చెక్

- నిల్వ నీటిలోనే దోమల వృద్ధి
- వాటిని నియంత్రిస్తేనే ఆరోగ్యం
- జోన్ - 5 పరిధిలో 82 మందికి డెంగ్యూ



అక్కయ్యపాలెంలో డెంగ్యూ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట : "ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయి..., డెంగ్యూ జ్వరమంటున్నారు... ఆస్పత్రిలో వైద్యం చేస్తున్నారు... చాలా ఖర్చవుతోంది..." ఇటీవల తరచుగా వింటున్న మాటలివి. డెంగ్యూ జ్వరం ఈడిస్ దోమ కుట్టడం వల్ల వస్తుంది. డెంగ్యూ జ్వరం బారిన పడకుండా ఉండాలంటే దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం. చికిత్స కంటే నివారణ చర్యలు నయం. కొద్దిపాటి అవగాహనతోనే డెంగ్యూ జ్వరం బారినపడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. అక్టోబర్ నెల ప్రారంభమైనా డెంగ్యూ జ్వరాల ఉధృతి తగ్గుముఖం పట్టడం లేదు. రోజూ విశాఖ ఉత్తర నియోజకవర్గంలో నమోదవుతున్న డెంగ్యూ జ్వరాలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు దోమలు వృద్ధి చెందడంతో జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. వారానికి ఒక రోజు డ్రై డే పాటిస్తే దోమల పెరుగుదలని నియంత్రించి తద్వారా డెంగ్యూ బారినపడకుండా ఉండవచ్చు.

దోమలు ఎక్కడ పెరుగుతాయంటే...

ఇటీవల వర్షాలు విస్తారంగా కురిశాయి. ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే ఖాళీ సీసాలు, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, రుబ్బురోళ్లు, తాగి పడేసిన టీ కప్పులు, బాటిల్స్, ఫ్రిజ్ వెనుక డ్రిప్ బాక్సు, కూలర్లు, మనీప్లాంట్లలో దోమలు పెరుగుతాయి. అలాగే నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, డ్రమ్ములు, ట్యాంకులు తదితర వాటిలో వారం పైబడిన నీటి నిల్వల్లో దోమలు చేరి గుడ్లు పెడతాయి. ఒక్క దోమ 200 గుడ్లు వరకు పెడుతుంది. ఇవన్నీ 10 నుంచి 12 రోజుల్లో దోమలుగా వృద్ధి చెందడంతో జ్వరాలను వ్యాప్తి చేస్తాయి.

డెంగ్యూ హాట్‌స్పాట్స్ గుర్తింపు

సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, గడిచిన మూడేళ్లలో మూడు కంటే ఎక్కువ డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైన సచివాలయాన్ని హాట్‌స్పాట్‌గా మలేరియా నివారణ విభాగం అధికారులు గుర్తించారు. ఆయా హాట్ స్పాట్స్‌లో కేసులు నమోదు కాకుండా జీవీఎంసీ యంత్రాంగం, జిల్లా మలేరియా నివారణ విభాగం ప్రత్యేక కార్యాచరణతో దోమల నియంత్రణకు పనిచేస్తున్నారు. జోన్ - 5 పరిధిలో ఈ ఏడాది 82 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో సుమారు 10 వరకు డెంగ్యూ హాట్‌స్పాట్స్‌ను ఇప్పటి వరకూ గుర్తించారు.

ఇలా చేస్తే జ్వరాలకు చెక్...

- దోమలు పెరగకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలి.
- వారానికి ఒక రోజు డ్రై డే పాటించి నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, డ్రమ్ములు శుభ్రం చేసి కొత్తగా నీరు పట్టుకోవాలి.
- నీటిని నిల్వచేసే గోళాలు, కుండీలు, ట్యాంకులపై మూతలు పెట్టాలి.
- ఫ్రిజ్ వెనుక డ్రిప్ బాక్సు, కూలర్లు వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- నీటిలో దోమ లార్వాలు పెరగతున్నట్టు గుర్తిస్తే ఆ నీటిని మట్టి లేదా ఇసుకలో కలిపేయాలి.
- దోమలు కుట్టకుండా శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలి
- ఇంటికి వచ్చే యాంటీ లార్వా సిబ్బందికి సహకరించి దోమల పెరుగదలని నియంత్రించాలి

ఇంటింటా అవగాహన కల్పిస్తున్నాం



ఏటా జూన్ నుంచి అక్టోబరు నెల వరకు డెంగ్యూ, మలేరియా జ్వరాల ఉధృతి కొనసాగుతుంది. జ్వరాల వ్యాప్తికి కారణమైన దోమల వృద్ధిని అరికడితేనే జ్వరాలను నియంత్రించగలం. జీవీఎంసీ యాంటీ లార్వా సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, జిల్లా మలేరియా నివారణ విభాగం సిబ్బంది ఫ్రై డే డ్రై డే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సిబ్బంది ప్రతీ ఇంటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి దోమ లార్వాలు పెరుగుతున్నట్లు గుర్తిస్తే ఆ నీటిని తొలగిస్తున్నారు. దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచి దోమల నియంత్రణను ప్రారంభించాలి.

– నగేష్ పట్నాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్

త్వరగా ప్రజా సమస్యల పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కంచరపాలెం : జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ - 5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు నలుగురు వినతులు అందించారు. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్ విభాగానికి 02 వినతులు అందినట్లు జెడ్సీ రాము తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ మత్స్యరాజు, టీపీవో విజయకుమార్, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్ధనరావు, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి, మంచినీటి విభాగం ఏఈ మోహన్ పాల్గొన్నారు.

22 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితులను రైల్వే పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎస్కే అబ్దుల్ మారూఫ్, సిబ్బంది కలిసి విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తమిళనాడుకు చెందిన సగుపార్ సతిక్, వై.రాజన్, ఎస్.అరుణాచలం, వరుణ్‌రాజ్ కన్నదాసన్ ఒడిశా నుంచి విశాఖ మీదుగా తిరుప్పూర్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వారి వద్ద ఉన్న 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, వారిని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు అప్పగించారు. జీఆర్పీ ఎస్ఐ ఎ.రవికుమార్ కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

రెల్లి జాతి వర్గీకరణపై చిన్న చూపు తగదు

ఉత్తరాంధ్ర రెల్లి కులాల సంఘ అధ్యక్షుడు హర్యాల రాముడు



కప్పరాడ ర్యాలీలో మాట్లాడుతున్న హర్యాల రాముడు, బంగారు సురేష్‌కుమార్

కంచరపాలెం : రెల్లి జాతి వర్గీకరణపై చిన్న చూపు తగదని ఉత్తరాంధ్ర రెల్లి కులాల సంఘం అధ్యక్షుడు హర్యాల రాముడు అన్నారు. ఈ మేరకు రెల్లి జాతి వారికి రిజర్వేషన్ శాతం పెంచాలని కోరుతూ జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి జైప్రకాష్‌నగర్ కప్పరాడ నుంచి విశాఖ కలెక్టరేట్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా కప్పరాడ కూడలి వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రావ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెల్లి సామాజిక వర్గానికి చెందిన వారిలో విద్యావంతులు అనేక మంది ఉన్నారని, రిజర్వేషన్ లేక వారు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉపాధి పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప చట్టసభల్లో ప్రాధాన్యత మాత్రం కల్పించడం లేదని వాపోయారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బంగారు సురేష్‌కుమార్ మాట్లాడుతూ రెల్లి జాతీయులకు కేంద్రం 1 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. తమ కులానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయానికి నిరశనగా ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బంగారి లక్ష్మీ నారాయణ, సురిపెల్లి మోహన్‌రావు, సోండి వెంకటరమణ, ఆకుల రాజు, మరియదాస్, సాయిపల్లి రాజు, రవీంద్రబాబు, మురళి, రజిత్, సుమన్, విజయ్‌బాబు, అనిల్, రాజేష్, మహేష్, రమేష్, రాజాన చంటి, తదితరులు పాల్గొన్నారు.

హైవేలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో బోల్తా పడిన కారు

మర్రిపాలెం : ఎన్ఏడీ కూడలి నుంచి తాటిచెట్లపాలెం వైపు వెళ్తున్న ఓ కారు కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజ్ సమీపంలో బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెందుర్తి ప్రాంతానికి చెందిన జ్యోష్న సోమవారం ఎన్ఏడీ జంక్షన్ నుంచి జాతీయ రహదారిపై నగరంలోకి వెళ్తున్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ సమీపానికి వచ్చేసరికి ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును అధిగమించే క్రమంలో అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న ఓ లారీ ఢీకొనడంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు వివరాలు సేకరించి ప్రమాదానికి కారణమైన వాహనాలను స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

వాసుపల్లి ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



అమ్మవారి సేవలో వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో 104 ఏరియాలోని తన కార్యాలయంలో సోమవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శాంతి రూపాన కనకదుర్గమ్మ అవతారంలో అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. వాసుపల్లి కుటుంబ సమేతంగా కనకదుర్గమ్మకు విశేష పూజలు చేశారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఎక్కడున్నా పిలిస్తే పలికే దైవం కనకదుర్గమ్మని అన్నారు. తన కార్యాలయ ప్రాంగణంలో శరన్నవరాత్రుల అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో వైభవంగా తిరు ఊరేగింపు ఉత్సవం, అణుపు కార్యక్రమం ఉంటాయని చెప్పారు.

శక్తి స్వరూపిణి.. అష్టసిద్ధి ప్రదాయిని

- మహాచండిగా అమ్మవారి దర్శనం
- మండపాల్లో విశేష హోమాలు, కుంకుమార్చనలు



బంగారు చీర అలంకరణలో లలితా అమ్మవారు



సీతంపేటలో బాలా త్రిపుర సుందరి అలంకరణలో పార్వతీ దేవి



మహాచండీ అలంకారంలో భూలోకమాత అమ్మవారు



దుర్గాదేవికి పూజలు చేస్తున్న శ్యామలాదీపిక

సీతంపేట : దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో లలితా అమ్మవారు బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలమాలలతో చూడముచ్చటగా అలంకరించారు. పీఠం దర్బారు హాల్లో వారాహిదేవి హోమం, లలితాదేవి హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య హోమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా అమ్మవారికి సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పీఠంలో సుబ్రహ్మణ్యస్వామి సర్పసూక్త హోమం, ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

- స్థానిక సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీ దేవి సోమవారం బాలా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులను అమ్మవారి స్వరూపంగా భావించి బాలపూజ చేశారు. అమ్మవారి శ్రీచక్ర మేరువులకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన జరిపారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మ పూజలు జరిపారు.

మహాచండీ అవతారంలో భూలోకమాత

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో గల శ్రీ భూలోకమాత అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

అమ్మవారు సోమవారం మహాచండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ ఇక్కడ అమ్మవారికి పంచామృతాభిషేకం, దివ్య అలంకారం, హోమం, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నామని రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం పెద్దలు తెలిపారు. ఈ నెల 12న దసరా వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ పెద్దలు, నాయకులు తెలిపారు.



కాళికాదేవిగా లలితాంబికాదేవి

కాళికాదేవి అవతారంలో లలితాంబికాదేవి

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో వెలసిన లలితాంబికా దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని కాళికాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకుడు భోగాపురపు ప్రసాద శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్, కోశాధికారి శ్రీనివాస్, జీవీ ఆనందరావు, పి.రామరాజు, విజయలక్ష్మి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



సీతంపేట పార్వతీశ్వరాలయంలో బాలపూజ చేస్తున్న మహిళలు

దుర్గాదేవికి పసుపుకొమ్ములతో పూజలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధి నక్కవానిపాలెం గాంధీనగర్‌లో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారికి పసుపు కొమ్ములతో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె, బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక అమ్మవారికి పసుపుకొమ్ములతో పూజలు చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ప్రధాన ఆర్గనైజర్ బండారు గుప్తాజీ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గోవింద్, గణేష్, నూకేష్, శంకర్, చంటి, గణేష్, పాల్గొన్నారు.

ఫోర్త్‌టౌన్ క్రైం స్టేషన్ పరిశీలన

సీతమ్మధార : ఫిర్యాదుదారుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని నగర క్రైమ్ ఏడీసీపీ ఎం.మోహన్‌రావు సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల నాలుగో పట్టణ క్రైం పోలీస్ స్టేషన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రైం కేసులను సకాలంలో పరిష్కరించాలని కోరారు. చోరీ సొత్తుని త్వరితగతిన రికవరీ చేసి బాధితులకు అప్పగించాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో గల ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి కేసుల వివరాలు తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ పరిధిలో రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు.

పాలస్తీనాకు అండగా ఉందాం



ప్రదర్శనలో వామపక్ష నాయకులు, కార్యకర్తలు

సీతమ్మధార : పాలస్తీనాకు అండగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ఇతర వామపక్ష పార్టీల నాయకులు విజ్ఞప్తి చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ మారణహోమం సృష్టించి ఏడాదైనా ఇంకా అక్కడ పరిస్థితులు మారలేదన్నారు. ఐక్యరాజ్య సమితి అక్కడ శాంతి నెలగొల్పాలని కోరారు. సోమవారం లలితా జ్యుయలర్స్ నుంచి ఆశీల్‌మెట్ట జంక్షన్ వరకు శాంతి ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, పైడిరాజు మాట్లాడుతూ ఇజ్రాయల్ దాడుల్లో జరిపి 42వేల మంది మృతి చెందారని, ఈ సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం ఖండించలేదన్నారు. అమెరికా అండదండలు చూసుకొని ఇజ్రాయల్ పేట్రేగిపోతోందని అక్కడ తక్షణమే శాంతిని నెలకొల్పాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ సీఎంపీఎస్ శర్మ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ నరసింగరావు, కె లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.కొండయ్య, ఎస్.గోవింద రాజులు, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి కె. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.